వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారం రవీంద్రనగర్‌లోని సాయిబాబా ఆలయంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెనోఖర్‌తో కలిసి నవగ్రహాల ప్రతిష్ఠాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మల్లేష్‌యాదవ్, నరసింహ, దామోదర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, హరికిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఏఎస్ రావునగర్ డివిజన్‌లో రూ.3 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషారెడ్డితో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, డివిజన్ నాయకులు కాసం మహిపాల్‌రెడ్డి, కుమారస్వామి, లక్ష్మీనారాయణ, మణెమ్మ, యాకయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్‌సెట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాల అధ్యాపకుడు వడ్డె నరసింహకు జేఎన్‌టీయూహెచ్ డాక్టరేట్ ప్రదానం చేసింది. సీఎంఆర్‌సెట్ కళాశాలలో సీఎస్‌ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ ధనలక్ష్మి పర్యవేక్షణలో 'సివియారిటీ ప్రిడిక్షన్ ఆన్ చెస్ట్ ఎక్స్‌రే ఫర్ కోవిడ్–19 యూసింగ్ మెషిన్ లర్నింగ్ టెక్నిక్' అనే అంశంపై పరిశోధన చేశారు. దీనికి జేఎన్‌టీయూహెచ్ డాక్టరేట్ ప్రదానం చేయగా.. బుధవారం కళాశాల చైర్మన్ గోపాల్ రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, డైరెక్టర్ నారాయణ, ప్రిన్సిపాల్ శేషుకుమార్, అధ్యాపకులు అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను సత్కరించి అభినందించారు.

ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం



పోచారం: కొర్రెముల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చడం అభినందనీయమన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థినీవిద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక అంశాలు ఆహూతులను విశేషంగా అలరించాయి. ఘట్‌కేసర్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం పాపిరెడ్డి, ప్రతాపసింగారం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

జవహర్‌నగర్: ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్, జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అల్వాల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బుధవారం జవహర్‌నగర్‌లో మానవ అక్రమ రవాణాపై రెండ్రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్వాల్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, శైలజలు మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ.. ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్య అన్నారు. ముందుగానే అడ్డుకుంటే ఆడపిల్లలను రక్షించుకోవచ్చన్నారు. పేద, మధ్యతరగతి వారు, ఉద్యోగం, ప్రేమ పెళ్లి, సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురవుతున్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ టీచర్ తమ పరిధిలోని మహిళలు, అమ్మాయిలకు మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ట్రెనింగ్ కో–ఆర్డినేటర్ అంబర్‌సింగ్, మిథాలిరాజ్, సుప్రియ, అల్వాల్ ప్రాజెక్టు అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త వేస్తే ఇంటికే చలాన్ !

● నిబంధనలు అతిక్రమిస్తే.. ● భారీ మూల్యం తప్పదంటున్న అధికారులు

ఉప్పల్: మీరు తడి, పొడి చెత్తను జీహెచ్‌ఎంసీ ఆటోకు వేస్తున్నారా.. లేదా రోడ్డుపైనే పారవేస్తున్నారా.. రోడ్డుపైనే చెత్తను వేస్తే చలాన్ మీ ఇంటికే వస్తుంది. అదేట్లా అనుకుంటున్నారా.. మీకు తెలియకుండానే జీహెచ్‌ఎంసీ సిబ్బంది మీ పరిసర ప్రాంతాల్లో ఉండి మీ ఫోటోను లేదా వాహనం ఫోటోను క్యాప్చర్ చేస్తారు. దీన్ని బట్టి మీ ఇంటికి నేరుగా లేదా సెల్‌ఫోన్‌కు చలానా వస్తుంది. ఇక నుంచి రోడ్డుపై చెత్తను వేసే వారికి జీహెచ్‌ఎంసీ అధికారులు భారీ ఎత్తున చలానాలను వడ్డించడం ప్రారంభించారు. గతంలో జరిమానా విధించి వదిలేసేవారు. ప్రస్తుతం భారీ ఎత్తున జరిమానా విధిస్తున్నారు.

◆ రోడ్లపై మొదటిసారిగా ఇళ్ల వ్యర్థాలను పారవేస్తే రూ.100 రెండోసారి గుర్తిస్తే రూ.1000, మూడోసారి రూ.10,000 వరకు జరిమానాను విధించనున్నారు.

◆ వ్యాపార సముదాయాలైతే షాప్‌ల ఎదుట డస్ట్‌బిన్ లేకపోయినా రోడ్లపైకి చెత్తను ఊడ్చేసి వెళ్లిపోయినా మొదటిసారి రూ.1000, రెండోసారి రూ.5000, మూడోసారి రూ.10,000 వరకు చలాను వడ్డించనున్నారు. అంతకన్నా ఎక్కువసార్లు గుర్తిస్తే వ్యాపార సముదాయ ట్రేడ్ లైసెన్స్‌ను రద్దు చేస్తామని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.



కామాక్షిపురంలో చెత్త పారబోస్తున్న వ్యక్తికి జరిమానా..

◆ ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా చిన్న, చిన్న షాపులు, హోటళ్లు, పాన్‌షాప్‌లు, టీ షాపులు, టిఫిన్ సెంటర్ల వద్ద నిత్యం ప్లాస్టిక్ పేరుకుపోయినా.. అధికారులు సీరియస్‌గా తీసుకుంటున్నారు. రూ.5000 నుంచి రూ.25,000 వరకు చలాన్ వడ్డించడానికి వెనుకాడబోమని హెచ్చరిస్తున్నారు.

◆ హోల్‌సెల్ షాపుల యాజమానులు జీహెచ్‌ఎంసీ హెచ్చరికలు బేఖాతరు చేసినా.. రూ.25,000 నుంచి రూ. లక్ష వరకు చలానాను విధిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.



ఉప్పల్ ఇండియన్ బ్యాంకు వద్ద చెత్త, చెదారం

◆ భవన శిథిలాల వ్యర్థాలు, ఇళ్ల నిర్మాణ వ్యర్థాలను రోడ్లపై వేస్తే రూ.25,000 నుంచి రూ. 50,000 వరకు జరిమానా విధిస్తామని చెబుతున్నారు.

◆ ప్రకటన బోర్డులు ఏర్పాటు చేసినా అనుమతిలేని బ్యానర్లు పోల్స్‌కు కట్టినా భారీమూల్యం చెల్లించక తప్పదంటున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే రూ.5000 వరకు ఫైన్ వేస్తామని అంటున్నారు.

నిర్లక్ష్యంగా ఉంటే భారీ మూల్యం తప్పదు..



నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దడంలో అధికారులతో పాటు స్థానిక ప్రజలే కీలకం. పరిసరాల పరిశుభ్రతపై ప్రభుత్వం కఠినంగా ఉంటోంది. నిబంధనలను అతిక్రమిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇప్పటికే ఉప్పల్ సర్కిల్ పరిధిలో గతనెల రోజుల్లో రూ.70 వేల వరకు జరిమానా విధించాం. ఇందులో దాదాపుగా రూ. 50,000 వరకు వసూలు చేస్తాం.

– డా. రణజీత్, ఏఎంహెచ్‌ఓ ఉప్పల్ సర్కిల్

ఎమ్మెల్యే వినూత్న నిరసన

చెట్టుకింద కూర్చొని ఫిర్యాదుల స్వీకరణ

మల్కాజిగిరి: అధికారుల తీరుకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి వినూత్నంగా నిరసన తెలిపారు. బోయినపల్లిలో నివాసం ఉంటున్న ఎమ్మెల్యే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలు అక్కడ ఏర్పాటు చేసిన తన కార్యాలయం నుంచి స్వీకరిస్తున్నారు. గతేడాది నుంచి మల్కాజిగిరి చౌరస్తాలో ఉన్న ఇందిరా మహిళాభవన్‌లో కార్యాలయానికి కేటాయించాలని లేదా మరేదైనా భవనాన్ని కేటాయించాలని అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అధికారుల తీరును నిరసిస్తూ మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం బయట చెట్టు కిందే కూర్చొని నిరసన తెలుపుతూ.. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపయోగంగా ఉన్న భవనాన్ని కేటాయించడానికి అభ్యంతరమేమిటని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి వ్యక్తిగత సహాయకుడిని కేటాయించాలని, అసెంబ్లీ సెక్రటరీ, అధికారులకు విజ్ఞప్తి చేసినా స్పందన లేదన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై వివిధ విభాగాల అధికారులతో మాట్లాడామని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్ సునీతా యాదవ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్‌గౌడ్, మురుగేష్, నాయకులు పరశురామిరెడ్డి, వెంకన్న, రాము యాదవ్, ఉపేందర్, సిద్ధిరాములు, చిన్నాయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

నాలా పూడికతీత పనులు ప్రారంభం



నాలా పూడికతీత పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి అధికారులు

రామంతాపూర్ : వరద నీటి నాలా పూడికతీత పనులను కార్పొరేటర్ బండారు శ్రీవాణి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాత్రి వేళల్లో నాలాల్లో మట్టి ఇతర వ్యర్థాలను టిప్పర్ల ద్వారా తెచ్చి పారబోస్తున్నారనే ఫిర్యాదులు అందుతున్నాయని, అలాంటి వారి వాహనాలు జప్తు చేసి భారీ జరిమానాలు విధించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఇంజినీర్ నాగమణి, అసిస్టెంట్ ఇంజినీర్ శ్వేత, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, బీజేపీ నేతలు నగేశ్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి

కాప్రా: ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సభకు తరలిరావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఏఎస్‌రావునగర్ డివిజన్ జమ్మిగడ్డలో బుధవారం ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల కోసం పాటుపడేది బీఆర్‌ఎస్ మాత్రమేనని, మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే తెలంగాణ బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషారెడ్డి, బీఆర్‌ఎస్ నేత సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, డివిజన్ నాయకులు కాసం మహిపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నేటి నుంచి చీర్యాల బ్రహ్మోత్సవాలు



చీర్యాల దేవాలయం

కీసర : భక్తుల కొంగుబంగారంగా పేరొందిన చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో నేటి నుంచి 27 వరకు సప్తదశ (17)వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..



బ్రహ్మోత్సవాల కోసం వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం. తాగునీరు, స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లు, వేసవిని దృష్టిలో ఉంచుకుని చలువ పందిళ్లు, ఉచిత అన్నప్రసాద వితరణ, రవాణా సౌకర్యం, వాహనాల పార్కింగ్, మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ, తదితర సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తున్నాం. ఈ మేరకు ఏర్పాట్లను పూర్తి చేశాం.

– మల్లారపు లక్ష్మీనారాయణ, ఆలయ చైర్మన్

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

సైదాబాద్: రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న కాంగ్రెస్ పార్టీకి త్వరలో ప్రజలే చరమ గీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని బీఆర్‌ఎస్ యాకత్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి సామ సుందర్‌రెడ్డి అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ ఎస్‌ఎన్‌రెడ్డి కాలనీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన నాయకులతో కలిసి రజతోత్సవ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 బహిరంగ సభకు పాతబస్తీ నుంచి లక్ష మందిని తరలించి రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను తప్పుడు హామీలతో మభ్యపెడుతుందని ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మేడ్చల్‌రూరల్ : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై నిజామాబాద్ నుంచి మేడ్చల్ వైపు వస్తుండగా.. గుర్తు తెలియని లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన తర్వాత లారీ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉన్నట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రజతోత్సవ సభ ఏర్పాట్ల పరిశీలనకు వెళ్తూ..

స్థానిక నాయకులతో కేటీఆర్ కరచాలనం



ఘట్‌కేసర్: పట్టణంలోని బైపాస్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు బీఆర్‌ఎస్ నేతలు బుధవారం స్వాగతం పలికారు. బీఆర్‌ఎస్ స్థాపించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఆయన వరంగల్ తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నేతలు నవీన్‌ప్రకాష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి కొండల్‌రెడ్డి, అన్ను, షకీల్, కృపా, సునీల్, సిరాజ్ కేటీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

రేపు భూ భారతిపై అవగాహన సదస్సు

ఘట్‌కేసర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి చట్టంపై ఏదులాబాద్‌లోని డీఎస్‌ఆర్ గార్డెన్‌లో శుక్రవారం అవగాహన కల్పించనున్నట్లు తహసీల్దార్ రజిని తెలిపారు. ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యలయంలో ఆమె మాట్లాడుతూ.. ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ గౌతమ్ హాజరై భూ భారతి చట్టం–2025లోని అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తారని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నీటి సరఫరా సమస్యను పరిష్కరించండి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాజ్‌సుఖ్‌నగర్‌లో జలమండలి కార్యాలయం ప్రారంభమైంది. మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, 16వ వార్డు అధ్యక్షుడు వేణుగోపాల్‌తో కలిసి బుధవారం జలమండలి డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డిలను కలిసి నీటి సరఫరా సమస్యను మెరుగుపరచాలని కోరారు. రాజ్‌సుఖ్‌నగర్ కాలనీ అధ్యక్షులు దాసు, కాంగ్రెస్ నాయకులు బాబురావు, మాదిరెడ్డి రాజిరెడ్డి తదితరులున్నారు.



భూ భారతి చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం

మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడిపల్లి: భూ భారతి చట్టంతో భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్‌తో కలిసి ఆయన హాజరై, పలువురి సందేహాలను నివృత్తి చేశారు. రెవెన్యూ రికార్డుల్లో తప్పులుంటే తహసీల్దార్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్, కలెక్టర్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం భూ భారతిలో ఉందన్నారు. ఎవరికైనా భూ సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సులు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జీపీఏ, మ్యూటేషన్ తదితర అంశాలను క్షుణ్ణంగా వివరించారు.



మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

ప్రభుత్వం నుంచి ప్రస్తుతం సెమీ గైడ్‌లైన్స్ మాత్రమే వచ్చాయని, పూర్తి మార్గదర్శకాలు వచ్చిన తర్వాత మరింత అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు, రెవెన్యూ అధికారులు, రైతులు, పీర్జాదిగూడ ప్రజలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



వెంకటాపురంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు



అల్వాల్‌లో బీఆర్‌ఎస్ జెండా దిమ్మెకు రంగులు వేస్తున్న కార్పొరేటర్

అల్వాల్: వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవసభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అనిల్‌కిషోర్ అన్నారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు రజతోత్సవసభ పోస్టర్‌ను బీఆర్‌ఎస్ నాయకులు వెంకటాపురం డివిజన్‌లో అతికించారు. నాయకులు శ్రీనివాస్, మోసిన్, రాజు, ప్రభాకర్, బాలి, విజయశేఖర్, సదానంద్, వీరేష్, జాంధర్, నర్సింగ్, కన్నా, జనార్దన్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలు కదలి రావాలి..

అల్వాల్: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు అన్ని వర్గాల ప్రజలు ఉప్పెనలా కదలి రావాలని కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా అల్వాల్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ జెండా స్తంభాలకు రంగులు అద్దారు. స్థానిక బీఆర్‌ఎస్ నేతలు తదితరులున్నారు.

ప్రిన్సిపాల్‌ను తొలగించాలని టీచర్ల ఆందోళన



ఆందోళన చేస్తున్న టీచర్లు, టీపీటీఎఫ్ సంస్థ ప్రతినిధులు

ఉప్పల్: ఓ ప్రైవేటు విద్యాసంస్థ ప్రిన్సిపాల్‌ను తొలగించాలంటూ పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల ఎదుట నిరసన చేపట్టారు. టీచర్లు చేస్తున్న న్యాయమైన ఆందోళనకు మద్దతుగా (టీపీటీఎఫ్) తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం మద్దతు తెలిపింది. ఉప్పల్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద ఈ మధ్యకాలంలో వెలిసిన విద్యాసంస్థ శాఖలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న జ్యోష్న విద్యార్థులను, తల్లిదండులతో పాటుగా పనిచేసే టీచర్లను సైతం రోజూ వేధింపులకు గురి చేస్తుందని టీచర్లు వాపోయారు. స్కూల్ అవరణలో విద్యార్థుల ఎదుట చెప్పుకోలేని భాష పదజాలాన్ని వాడుతూ.. టీచర్లను తిడుతోందని, వారిస్తే జీతంలో కోతలు పెడుతూ.. ఇబ్బందులకు గురిచేస్తుందని, ఇలాంటి ప్రిన్సిపాల్‌పై ఇప్పటికే విద్యాసంస్థ యాజమానులకు ఫిర్యాదు చేశామని, వారు హెచ్చరించినా ఆమె వ్యవహారశైలిలో ఎలాంటి మార్పు రాలేదని వాపోయారు. ఇప్పటికైనా యాజమాన్యం తమ సమస్యలను పరిగణలోకి తీసుకుని ప్రిన్సిపాల్‌పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పహల్గాం ఉగ్రదాడికి నిరసన



మల్కాజిగిరి చౌరస్తాలో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో నిరసన

మల్కాజిగిరి: జమ్మూకశ్మీర్ పహల్గాంలో హిందువులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా మల్కాజిగిరి చౌరస్తాలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం నాయకులు సునీతారెడ్డి, కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ.. ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని, ఉగ్రవాదాన్ని కేంద్రం పూర్తిగా అణిచివేయాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు ఆర్‌కె. శ్రీనివాస్, ఆనంద్, బాలచందర్‌గౌడ్, సునీల్‌యాదవ్, నవీన్, శ్రీనివాస్‌ముదిరాజ్ తదితరులున్నారు.

అల్వాల్: జమ్మూకశ్మీర్ పహల్గాంలో టూరిస్ట్‌లపై జరిగిన హింసాకాండను నిరసిస్తూ బుధవారం అల్వాల్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళులర్పించారు. ఈ హింసాకాండకు పాల్పడిన మతోన్మాద దుష్టశక్తులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మల్లికార్జున్‌గౌడ్, కార్తీక్‌గౌడ్, మురళీ, లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి, బాబి తదితరులున్నారు.

బట్టతలకు మందు ఇస్తామని బురిడీ..

పోలీసుల అదుపులో నిర్వాహకుడు



ఉప్పల్ భగాయత్ శిబిరం వద్ద ఎగబడిన జనం

ఉప్పల్: బట్టతలకు మందు అంటూ ఉప్పల్ భగాయత్‌లో ఏర్పాటు చేసిన శిబిరం గుట్టును ఉప్పల్ పోలీసులు రట్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా రాజానాయక్ తాండాకు చెందిన హరీష్ అనే వ్యక్తి బట్టతలకు మందు వేస్తామంటూ.. ఇన్‌స్టాగామ్‌లో ప్రకటన చేసి, ఉప్పల్ భగాయత్‌లో శిబిరం ఏర్పాటు చేశాడు. దీంతో బట్టతల ఉన్న వారంతా దూర ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది శిబిరానికి ఎగబడ్డారు. రూ.300లకు షాంపూ, లేపనానికి రూ.700 అంటూ.. మొత్తం రూ. ఒక్కోక్కరి వద్ద రూ. 1000 వరకు వసూలు చేస్తున్నారు. వందలాది మంది గుమిగూడటంతో గందరగోళం ఏర్పడింది. దీంతో సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు బట్టతలకు మందేంటి అని ఆరా తీశారు. అదంతా ఫేక్ అని తేలడంతో నిర్వాహకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీంతో శిబిరానికి వచ్చిన వారంతా వెనుదిరిగారు.

నిషేధిత సిగరెట్ల విక్రేత రిమాండ్

హస్తినాపురం: నిషేధిత సిగరెట్లను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హుడా కాంప్లెక్స్‌లో ఉన్న పూర్ణిమ ట్రేడర్స్ షాపులో నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం రాత్రి తనిఖీలు చేసి వివిధ రకాల సిగరెట్ల ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమాని సోమిశెట్టి పుల్లయ్య (67)ను రిమాండ్‌కు తరలించాలమన్నారు.